# "టర్" – మనుష్యులు

* వేముగంటి అనంతరావు *

★

భగవంతుడు జంతుజాలంతో పాటు మనుష్యుల్ని కూడా సృష్టించి, యీ ప్రకృతిలో స్వేచ్ఛగా వదిలిపెట్టాడు! కాని, మానవుడు స్వార్థపరత్వంతో మిగిలిన జంతువులయొక్క స్వేచ్ఛను హరించాడు! దానితో తృప్తిపడకుండా, తనవంటి మానవుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనుకూడా అరికట్టడానికై కొన్ని హద్దులు యేర్పరచడానికి ప్రయత్నించాడు! తత్ఫలితంగా మానవులమధ్య అంతర్ సృష్టి ప్రారంభమైంది! ఈ అంతర్ సృష్టి క్రమక్రమంగా ఆంగ్లేయ పాలనలో మన గడ్డ మీద రూపొందింది! దీనిలో తగిన ప్రముఖపాత్ర వహించడానికి నిర్ణయింపబడిన వర్గపు మానవులే "టర్" మనుష్యులు! ఈ "టర్" నామధారులనుసరించి కొంచం చూద్దాం:

కలక్టర్: ఈ "టర్" గారి పేరు విననివారుండరు! విదేశీ ప్రభుత్వకాలంలో సాధ్యమైనంతవరకూ తమ మాతృదేశాన్ని పరప్రభుత్వానికి దోచిపెట్టడమే వీరి విధ్యుక్తధర్మంగా వుండేది! ప్రస్తుతం దేశకాలపాత్రతల ననుకూల్యంగా ప్రవర్తించడానికి తాపత్రయపడుతున్న దేశభక్తులలో వీరు ముఖ్యులు!

మాస్టర్: ఈ "టర్" గారికి "ఆరు నెలల పని, పన్నెండు నెలల జీతం" అని అందరూ అసూయపడుతున్నారు! అవతల రాజాశ్రయం, యివతల ప్రజాశ్రయం లేక బాధపడుతూవున్న వర్గపు మనుష్యులలో వీరు ముఖ్యులు! పాఠాలు చదవనందుకు శిక్షిస్తే విద్యార్థులు కోపిస్తారు! ఎక్కువ జీతం, అధిక సమానత్వం కోరితే ప్రభుత్వం నిరశిస్తుంది! వీరి పనికి విలువలేదు! వీరు సమ్మె చేస్తామంటే వీధికుక్కలు కూడా భయపడవు! కేవలం పరమార్థంకోసం మాత్రమే వీరు పనిచేస్తున్నట్లు తెలిసినప్పుడే వీరికి గౌరవం! "టర్" వర్గపు మనుష్యులలో బహుశా దయనీయ పరిస్థితులలో వున్నవారు వీరే!

మినిస్టర్: "టర్" మనుష్యులలో అదృష్టజాతకులు వీరే! వీరు తలచుకొని సాధించలేని కార్యాలు బహుశా అరుదు! వీరు వెళ్ళిన చోట్ల టీపార్టీలు జరుగుతాయి! సన్మానాలు లభిస్తాయి! ఏ యెండకా గొడుగు పట్టడంలోను, "పట్టు—విడుపు"ల అంతర్యం తెలుసుకొని ప్రవర్తించడంలోను, వీరిని మించిన నేర్పరులు చాలా అరుదుగా వుంటారని ప్రతీతి!

వోటర్: ఈ ప్రజాస్వామికయుగంలో మంత్రులను నిలపడానికి, శాసనసభ్యులను గెలిపించడానికి యీ వర్గంవారే సహాయపడాలి! ఎలక్షన్ రోజులలో వీరికివ్వబడే ఆదరగౌరవాలు అపారం! వాగ్దానాలు వర్ణనాతీతం! కాని, యెలక్షన్లు జరిగినతర్వాత, తిరిగి యెలక్షన్లు వచ్చేవరకూ వీరు బ్రతికివున్నా, చచ్చినా యెవరికీ అవసరం లేదు!

బారిస్టర్: లేని విరోధాలు కల్పించి, కోర్టులకు పని కల్పించడంలోను, రాజీకి వస్తున్న కేసులను మళ్ళీ మొదటికి తీసుకురావడంలోను యీ వర్గపు మనుష్యుల కుండవలసిన శక్తి అపారం!

ఎడిటర్: "టర్" మనుష్యులలో ప్రత్యేకస్థానం వీరిదే! అజ్ఞానాన్నర విలువచేసే వీరి కలంలో ఫిరంగులు, మరతుపాకులు, ఆటంబాంబులుకంటె యెక్కువైన శక్తి వుంది! వ్యాఖ్యా, వ్యాఖ్యావాదులలో వీరి 'కత్తిర'కు ప్రత్యేక స్వాతంత్ర్యం వుంది! తలచుకొంటే వీరు చేయలేని కార్యం లేదు! ఉద్యోగాధికారి మొదలు భిక్షాధికారివరకూ —

రాజు మొదలు దవాళీఖానా వరకూ — వీరియొక్క ప్రాభవం పొందటానికై ప్రాకులాడవలసిందే! వీరి మారణాస్త్రప్రయోగానికి యిహలోకంలో మరి తిరుగులేదు!

డైరక్టర్ : ఈ "టర్" వర్గమనుష్యులు చలనచిత్ర పరిశ్రమలో యెక్కువగా గోచరిస్తూ వుంటారు! తలచుకొన్న యువతులను తారలను చేయడం, తమ కిష్టంలేనివారిని అథోలోకానికి త్రోయడం-యివి వీరు విలాసంకోసం చేసే నిత్యకృత్యాలలో కొన్ని!

డాక్టర్ : ఈ టర్ మనుష్యులతో పాటుగా క్రొత్తక్రొత్త వింతరోగాలు, ఆ రోగాలతో పాటుగా వీరు యీ ప్రపంచంలో అభివృద్ధిచెందుతూ వున్నారు! సాధారణంగా వీరితో విరోధం పెట్టుకొన్న మానవులు అరుదు!

డిక్టేటర్ : ద్వితీయ మహాప్రపంచయుద్ధంతో పాటుగా యీ టర్ గారి పేరు కాలగర్భంలో కలిసిపోయి, ప్రస్తుతం నామరూపాలు లేకుండా నశించిపోయింది!

ఈ విధంగా యీ టర్ వర్గానికి చెందిన మానవులనుగురించి చాలా వ్రాయవచ్చు! పైన చెప్పబడినవారు కాక, యింకా—"యాక్టర్, మీడియేటర్, కంట్రాక్టర్, ప్రొసిక్యూటర్, ఇనస్పెక్టర్, ఎడ్మినిస్ట్రేటర్"—మొదలైన వర్గాలవారు ముఖ్యులు! ఈ "టర్" తత్వం మానవులతోపాటుగా మిగిలిన విషయాలలోకూడా గోచరిస్తోంది!" థియేటర్, వాటర్, లెటర్, మేటర్, క్యారక్టర్, ఇంటర్, క్వార్టర్ — ఈ విధమైన టర్ అంత్యాలు చాలా వున్నాయి!

ఆంగ్లేయప్రాభవం, విదేశీపరిపాలన అంతరించింది గనుక, ఆంగ్లేయవాసనలతో, విదేశీతత్వాలతో, పాశ్చాత్యాభిరుచులతో పూర్తిగా నిండి వున్న యీ 'ఇంటర్'సృష్టి సూత్రధారులను— ఈ "టర్" మనుష్యులను—కూడా పూర్తిగా జాతీయంచేసేవరకూ మనకు వచ్చిన స్వాతంత్ర్యం వుపభోజ్యం కాదు కదా!


